క్లుప్తంగా

ఎమ్మెల్యేకు పరామర్శ



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

పటాన్‌చెరు: ఇటీవల ఎమ్మెల్యే పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం అత్యంత బాధాకరమని రాష్ట్ర దేవదాయ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. మహిపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణంపై మంథని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి, బిత్తిరి సత్తి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాసంలో ఆయనను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

న్యాయశాస్త్రంపై అవగాహన అవసరం

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యార్థులకు న్యాయ సంబంధమైన విషయాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట కోర్టు జడ్జీ ధనలక్ష్మి అన్నారు. శనివారం చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షతన శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి క్రమశిక్షణను అలవర్చుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం న్యాయవాది శివప్రసాద్, పుల్కల్ ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

మనూరు(నారాయణఖేడ్): వ్యవసాయ క్షేత్రాల రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన ఘటన మనూరు శివారులో శనివారం చోటుచేసుకుంది. రైతులు రాఘవచారి, విజయ్‌కుమార్ జ్యోషి, ఈశ్వరమ్మ, విఠల్, అంజమ్మ, పండరి తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో వ్యవసాయ పొలాల వద్ద బోరు కేబుల్స్‌ను సైతం దొంగలించారని గుర్తు చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం మనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమలో పనిచేసే చోట ఓ కార్మికుడి కాళ్లపై నుంచి క్రేన్ వెళ్లి తీవ్ర గాయాలైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన తాప్సీ కుమార్‌చంద్ర బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలంలోని నంది గ్రామంలో ఉంటూ స్థానికంగా ఉన్న సవేరియా పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో క్రేన్ సహకారంతో పైపులను తీసుకెళ్తుండగా తాప్సీ కుమార్‌చంద్ర కింద పడిపోయాడు. ఇది గమనించకుండా క్రేన్ డ్రైవర్ ముందుకువెళ్లడంతో అతని రెండు కాళ్లపై నుంచి క్రేన్ వెళ్లగా తీవ్రంగా గాయాలైన తాప్సీ కుమార్ చంద్రను చికిత్స నిమిత్తం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

కోహీర్(జహీరాబాద్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను రక్షించుకోవడానికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని డాట్ శాస్త్రవేత్త సరిత రైతులకు విజ్ఞప్తి చేశారు. ఏడీఏ భిక్షపతి, ఏఓ నవీన్‌కుమార్‌తో కలిసి శనివారం మండలంలోని గురుజువాడ, మద్రి గ్రామాలలో పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంపునకు గురైన పంట పొలాల్లో నీటిని బయటికి పంపించాలన్నారు. వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించడానికి కృషి చేయాలని, చీడపీడల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

తెగిన హైటెన్షన్ వైర్లు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగిపడి ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సర్పంచ్ కిష్టప్ప ఇంటిలో విద్యుత్ పరికరాలు, వస్తు సామగ్రి కాలిపోయి రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని సర్పంచ్ వాపోయాడు. కమ్యూనిటీ హాల్‌లో వైరింగ్ కాలిపోవడంతో మరో మూడుచోట్ల మంటలు చెలరేగాయి. అయితే ఆ సమయంలో సంఘటన స్థలంలో గ్రామస్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదాన్ని గుర్తించిన హెల్పర్ అలీ విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో గ్రామ పజలు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామం మధ్యలో నుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలను తొలగించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని సర్పంచ్ కిష్టప్ప వాపోయాడు.

వంతెన నిర్మించేదెన్నడో?

- ఏళ్లు గడుస్తున్నా తీరని సమస్య
- ఇబ్బందుల్లో ప్యారవరం, బొప్పన్‌పల్లి గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



వాగు ఉధృతి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గ్రామాల రహదారులు, వంతెనల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అందుకనుగుణంగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా తమ గ్రామాలకు వంతెన లేకపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని ప్యారవరం, బొప్పన్‌పల్లి గ్రామస్తులు వాపోతున్నారు. – ఝరాసంగం(జహీరాబాద్):

మండల పరిధిలోని బొప్పన్‌పల్లి గ్రామం నుంచి ప్యారవరం గ్రామానిక వెళ్లే దారి మధ్యలో ఉన్న వాగుపై వంతెన లేకపోవటంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది.

రాకపోకలకు తీవ్ర అంతరాయం

ఝరాసంగం మండలంలోని ప్యారవరం, బొప్పన్‌పల్లి గ్రామాల నుంచి జహీరాబాద్‌కు విద్యాభ్యాసం చేసేందుకు విద్యార్థులు, రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో వర్షం కురిసిన సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో వరద ఉధృతి తగ్గేంతవరకు ఇరువైపులా ఉన్నవారు నిస్సహాయంగా ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాకుండా గ్రామంలో ఏదైనా అత్యవసరం ఉంటే వేరే గ్రామాల మీదుగా వెళ్లాల్సినప్పుడు దూరభారంతో పాటు సమయం వృథా అవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

గతంలో వరద వచ్చిన సమయంలో వాగు దాటేందుకు ప్రయత్నించిన సమయంలో పలువురు మృతి చెందిన సంఘనలు ఉన్నాయి. దీంతో వాగుపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాగుపై వంతెన నిర్మించాలని ప్యారవరం, బోప్పన్‌పల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



గ్రామానికి వచ్చేందుకు ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మించాలి. బ్రిడ్జి లేకపోవటంతో ప్రతి సంవత్సరం కురిసే వర్షాలకు ఎక్కడి వారు అక్కడే నిలడాలి. వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు వెంటనే స్పందించి వంతెన నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– సంగమేశ్వర్, స్థానికుడు ప్యారవరం

ఇబ్బందులు తప్పడంలేదు



గ్రామంలో ఏదైనా అత్యవసరం ఉంటే ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంటుంది. వాగుపై బ్రిడ్జి లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా రాత్రి సమయంలో వరద వస్తే మరింత ఇబ్బంది ఉంటుంది. బ్రిడ్జి నిర్మిస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.

–జైపాల్, స్థానికుడు, ప్యారవరం

అర్హులకు దళితబంధు



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్
- గుమ్మడిదలలో సీఎం దిష్టిబొమ్మ దహనం

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం గుమ్మడిదల మండల కేంద్రంలో శనివారం రాస్తారోకో చేపట్టి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దళిత ఓట్లను దండుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దళిత ద్రోహి అని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వడ్డెకృష్ణ, నర్సింగ్‌రావు, యాదగిరి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ప్రతి ఒక్క దళితునికి దళితబంధు పథకాన్ని అమలుచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అదే విధంగా సోలక్‌పల్లి గ్రామంలో బీజేపీ నేత జగన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.

రాజకీయ కోణంలో చూడొద్దు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకాన్ని రాజకీయ కోణంలో కాకుండా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. శనివారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకం కింద ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం రానటువంటి లబ్ధిదారులందరికీ పథకాన్ని అందిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, రాంచందర్, నరసింహరెడ్డి, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, రేవంత్‌కుమార్, శ్రీనివాస్, యాదవ రెడ్డి, విద్యాసాగర్, యాదగిరి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



రామచంద్రాపురంలో..

నారాయణఖేడ్: ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనానికి చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో శనివారం రెండు గంటల పాటు బంద్ నిర్వహించి డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గవర్నర్ చర్యలతో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని వెంటనే ఆమోదించాలని కోరారు. కార్మిక నాయకులు నెహ్రూ, శంకర్‌రావు, మల్కయ్య, నర్సింహులు, సంగీత, శోభ, యమున తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలోకి విలీనం చేసే బిల్లును గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ టీఎంయూ ఆధ్వర్యంలో శనివారం బెల్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపించిన బిల్లును ఆమోదించకుండా గవర్నర్ ఆలస్యం చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా గవర్నర్ స్పందించి బిల్లును వెంటనే ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, బలరాం, పీఎం రెడ్డి, వీఎస్ఎన్ రావు, కిషోర్, రమేష్, డీజే రావు, హరిలాల్ పాల్గొన్నారు.

'దేశ ప్రజలను చీల్చేందుకే యూసీసీ బిల్లు'

జహీరాబాద్ టౌన్: దేశ ప్రజలను చీల్చేందుకే కేంద్ర ప్రభుత్వం యూసీసీ బిల్లును ముందుకు తీసుకువచ్చిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జేబీ రాజు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సమాఖ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్లమెంట్ హౌస్ నామకరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బసవేశ్వర భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేబీ రాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సర్కార్ దేశాభివృద్ధిని విస్మరించి ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని ఆరోపించారు. యూసీసీ పేరుతో మరోసారి దేశ ప్రజలను విభజించేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూసీసీ వల్ల కలిగే నష్టాల గురించి ప్రజాకవి జయరాజ్ వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్, నిర్వాహకులు కక్కర్‌వాడ నర్సింలు, టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ పాల్గొన్నారు.

సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కోహీర్(జహీరాబాద్): పోగొట్టుకొన్న సెల్‌ఫోన్‌ను కోహీర్ పోలీసులు చాకచక్యంగా కనుగొని యజమానికి అప్పగించారు. మండలంలోని పిచేర్యాగడి నివాసి శ్రీకాంత్ గత మే12 తేదీన మండలంలోని కవెలి క్రాస్ రోడ్డు వద్ద సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో ఈసీఐఆర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు హోతి(కే)ఈ తండాలో ఒక వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ ఉన్నట్టు గుర్తించి శనివారం శ్రీకాంత్‌కు అప్పగించారు.

కంప్యూటర్ విద్య అత్యంత అవసరం

జహీరాబాద్ టౌన్: నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ విద్య అత్యంత అవసరమని రవాణాశాఖ అధికారి జయప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్, ఉచిత కుట్టు శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి శనివారం ఆర్టీఓ జయప్రకాశ్ హాజరై సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలంటే కంప్యూటర్ నాలెడ్జ్ ఎంతో అవసరమన్నారు. ఇలాంటి శిక్షణ తరగతులు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. శ్రామిక విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ శివబాబు, ట్రస్టీ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న జయప్రకాష్‌రెడ్డి

కొనసాగుతున్న తొలిమెట్టు శిక్షణ శిబిరం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణా శిబిరాన్ని శనివారం రాష్ట్ర పాఠ్యపుస్తక నిపుణులు సువర్ణ వినాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మౌలికభాష, గణిత సామర్థ్యాల సాధనకు తొలిమెట్టు శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర అధికారి బక్షి విజయరావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు రవిప్రకాష్, వినయ్‌కుమార్, రాజ్‌కుమార్, ఎంఈఓ విశ్వనాథ్, మండల నోడల్ అధికారి పుండ్లిక్, రిసోర్స్ పర్సన్లు దత్తురాం, మశ్చందర్, నరేష్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్: మాట్లాడుతున్న సువర్ణ వినాయక్

కొనసాగుతున్న తొలిమెట్టు శిక్షణ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(బి) జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ కొనసాగుతోంది. శిక్షణలో భాగంగా శనివారం పలు అంశాలపై శిక్షకులు, ఎంఈఓ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ మారుతి రాథోడ్, శిక్షకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాలను సందర్శించిన ఎస్ఆర్‌పీలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో కొనసాగుతున్న శిక్షణ కేంద్రాలను శనివారం ఒరియంటేషన్ శిక్షణ కేంద్రాలను రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్(ఎస్ఆర్‌పీ)లు సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ బస్వరాజ్, నోడల్ అధికారులు మాణయ్య, బస్వరాజ్ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



నారాయణఖేడ్: పండ్లు అందజేస్తున్న సిబ్బంది



ఝరాసంగంలో..

నారాయణఖేడ్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం నారాయణఖేడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పోషన్ అభియాన్ అధికారి నవర్తి, అంగన్‌వాడీ టీచర్లు విమల, జగదేవి, స్వరూప, సహాయకులు రాధమ్మ, అంబిక పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

వట్‌పల్లి (అందోల్) : అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని జోగిపేటలో అంగన్‌వాడీ-1 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశకార్యకర్తలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

ఝరాసంగం(జహీరాబాద్): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని సిద్ధాపూర్ అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వీరేందర్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ సూచించారు. శనివారం ఝరాసంగం రైతువేదికలో ఆయిల్ పామ్ సాగు విధానం, ప్రభుత్వం అందించే సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో 50 మొక్కలు అవసరం ఉంటుందన్నారు. ఒక్కో మొక్క ధర రూ.213 ఉండగా రైతుకు కేవలం రూ.20 మాత్రమే అందిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు అందజేయనున్నట్టు తెలిపారు. బీసీ, ఓబీసీ రైతులకు 90శాతం సబ్సిడీపై అందించనున్నట్లు వివరించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా ఎకరాలో10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సుభాష్‌రావు, డ్రిప్ అధికారి సంగమేశ్వర్, ఏఈఓ జ్ఞానం, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చెక్కులు పంపిణీ**

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 11మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ దేవానందం, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (పటాన్ చెరు): పట్టణంలోని వార్డు కార్యాలయంలో డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ కళ్యాణలక్ష్మి, చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, ఆర్ఐ శ్రీకాంత్, నాయకులు పరమేష్‌యాదవ్, నర్సింగ్, కుమార్, దాసు, యాదయ్య పాల్గొన్నారు.

◆ **డివిజన్ అభివృద్ధే లక్ష్యం**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధే లక్ష్యమని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్సీ బస్తీ శ్మశానవాటికకు వెళ్లే దారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారడంతో అంత్యక్రియలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ సంఘం కులపెద్దలు శనివారం కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కార్పొరేటర్ రోడ్డుకు మరమ్మతులు పనులు చేయించి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. శంకర్, రాములు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో అర్హులైన నలుగురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, వేణుపాల్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్ చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఏడుగురు లబ్ధిదారులకు కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం భరోసాగా నిలుస్తోందని తెలిపారు.

◆ **కేవీపీఎస్ నూతన కమిటీల ఎన్నిక**

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాలకు సంబంధించి కేవీపీఎస్ నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘంగ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మనూరు మండల అధ్యక్షుడిగా సంగయ్య, ప్రధాన కార్యదర్శిగా అతిమేల అరుణ్‌ను ఎన్నుకోగా నాగల్‌గిద్ద మండల అధ్యక్షుడిగా గుల్లె శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా గైని శ్రీకాంత్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **గొర్రెల పంపిణీ**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని జంగంపేట గ్రామంలో సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ ఆధ్వర్యంలో శనివారం గొర్రెల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల ఆధ్వర్యంలో గొర్రెలను పంపిణీ చేశారు.

ఇస్నాపూర్, బచ్చుగూడెం గ్రామంలో

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్, బచ్చుగూడెం గ్రామంలో గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శైలేంద్ర జస్వల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, ఇస్నాపూర్ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సామాజిక సేవలో పాల్గొనండి**

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ సామాజికసేవలో పాల్గొనాలని శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ అన్నారు. శనివారం భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో చాతుర్మాస్య వ్రత దీక్ష మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 7న గచ్చిబౌలి స్టేడియంలో కృష్ణాష్టమి సందర్భంగా భగవద్గీత పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **కొనసాగుతున్న దేవాలయ పనులు**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణ పనులను మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అనంతరం దేవాలయ నిర్మాణానికి సహకరిస్తున్న బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిని దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు భరత్‌చారి, విఠల్‌చారి, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

జహీరాబాద్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని దిడిగి గ్రామంలో శనివారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, నియోజకవర్గం అధ్యక్షుడు నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మృతుడి కుటుంబానికి పరామర్శ**

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల మండల పరిధిలోని కుప్పానగర్‌లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన మర్పల్లి నాగన్న కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ నాయకుడు నరోత్తం నాయకులతో కలిసి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సుభాష్‌రావు, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్‌లో చేరిక**



జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని గుడ్పల్లి గ్రామ ఉపసర్పంచ్ సిద్దురెడ్డి, న్యాల్‌కల్ మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నరోత్తం ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో ఇబ్రహీంపూర్ ఉపసర్పంచ్ నాగమ్మ తనయుడు దిగంబర్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.